# నిర్ణయం

**- ఓల్గా**

తెల్లవారుజాము నుంచీ ఒకటే తుంపర. కురవనూ కురవదు. వెలవనూ వెలవదు.

కిటికీలోంచి వానతుంపర చూస్తున్న కమలకు తన పరిస్థితికీ బైటి వాతావరణానికీ పోలిక ఉన్నట్టనిపించింది.

ఏదో ఒకటి జరగాలి. జరిగి తీరాలి. తేల్చుకోవాలి. తను సమస్యను వాయిదా వేస్తోందో, సరైన మార్గంలోనే ప్రయాణం చేస్తోందో అర్థం కావటంలేదు కమలకు.

ఇంటా బైటా ఎక్కడా ప్రశాంతంగా తిరగలేకపోతోంది. రెండుచోట్లా తప్పు చేసినట్లు తప్పుకు తిరగాల్సి వస్తోంది. తను తప్పుకు తిరిగినంత మాత్రాన ఏమవుతుంది? ఇంట్లో మొగుడు ఊరుకుంటాడా? బైట మొగుడులాంటి మేడమ్ ఊరుకుంటుందా? ఒళ్ళో నిప్పులు మోస్తున్నట్లుగా ఉంది కమలకు.

"టైమ్ కావటంలా - వాన వెలిసేట్టు లేదుగానీ గొడుగు తీసుకుని పద. మీ డాక్టరమ్మతో ఇవాళైనా చెప్పించావు."

కమల మొగుడు విశ్వనాథం లోపల్నించే కేకేశాడు. అతను నైట్ డ్యూటీ చేసి వచ్చాడు. పదింటికి భార్య వెళ్ళిపోతే తలుపేసుకుని పడుకుందామని చూస్తున్నాడు. వెలవని వర్షం, కదలని భార్యా అతనికి చికాకనిపించాయి.

కమల నర్సు. డాక్టర్ శైలజ నర్సింగ్ హోంలో పనిచేస్తోంది. ఆమెకూ నైట్ డ్యూటీలుంటాయి. వీళ్ళిద్దరి నైట్ డ్యూటీల సందునా పిల్ల నలిగిపోతుందని కమల కూతురు మూడేళ్ళ ప్రియాంకను పుట్టినప్పటి నుంచీ కమల తల్లే సాకుతోంది.

కమలకు మూడు నెలల క్రితం వరకూ ఇంటా బైటా అంతా హాయే! అంతా ఆనందమే.

భర్త కాస్త కోపదారి మనిషైనా అది కమలను తాకే అవసరం రాలేదు. బహుశ కమల ఆ పరిస్థితి రానిచ్చి ఉండదు.

శైలజ డాక్టర్‌గా ఎంత మంచిదో మనిషిగానూ అంతే మంచిది. తన దగ్గర ఉద్యోగం చేసే వాళ్ళందరి మీదా యజమానురాలిలా పెత్తనం చెయ్యదు. స్నేహంగా ఉంటుంది. కమలంటే శైలజకు మరీ ఇష్టం. కమలకు తన పనిలో నైపుణ్యం ఉంది. ముఖ్యంగా కాన్పుల గదిలో కమల లేకపోతే శైలజకు ఊపిరాడదు. ఆ సమయంలో ఎప్పుడేం చెయ్యాలో దాదాపుగా శైలజకు తెలిసినంతా కమలకు తెలుసు. ఆరేళ్ళ అనుభవం ఆమెది. నొప్పులు పడుతూ వచ్చిన ఆడవాళ్ళను చూస్తూనే వాళ్ళ పరిస్థితి అర్థం చేసుకుంటుంది. అనవసరంగా ఆదుర్దాపడేవాళ్ళకు నెమ్మదిగా నచ్చజెపుతుంది. వినకపోతే మెల్లిగా మందలిస్తుంది. వాళ్ళను కాన్పుకు సిద్ధం చేస్తుంది. శైలజను ఎప్పుడు పిలవాలో కూడా కమలకు తెల్సినట్లు మరింకో నర్సుకెవరికీ తెలియదు. అందుకే శైలజ కమలను ప్రత్యేకంగా చూస్తుంది. కమల పెళ్ళికి సహాయం చేసింది. తనే స్వయంగా కాన్పు చేసింది. మూడేళ్ళపాటు మళ్ళీ పిల్లలొద్దని లూపు కూడా వేసింది. మూడేళ్ళు నిండాక ఆ లూపు తనే తీసేసింది. అపుడపుడూ చీరెలు కొనిపెడుతుంది. అవసరానికి డబ్బు అప్పిస్తుంది. అన్ని రకాలుగా అండగా వుండే శైలజంటే కమలకు గౌరవం, ప్రేమ.

సంసార జీవితంలోనూ కలతలు లేవు. విశ్వనాథం మందుల కంపెనీలో పనిచేస్తాడు. నెలకు నాలుగైదు నైట్‌డ్యూటీలు చెయ్యాలనే గానీ అతనిదీ మంచి ఉద్యోగమే. కమలను ఇష్టపడి చేసుకున్నాడు. తొలిసారి మగబిడ్డ పుట్టలేదని నిరాశపడినా భార్యంటే, కూతురంటే ఎంతో ప్రేమ. మనవరాల్ని పెంచటంలో ఆనందాన్నునుభవిస్తున్నారు కమల తలిదండ్రులు. అంతా సజావుగానే ఉంది. నాలుగు నెలల క్రితం కమల నెలతప్పే వరకూ. అక్కణ్ణించే ప్రారంభమైంది విశ్వనాథం సణుగుడు.

> "అది పూర్తి సెంటిమెంటల్ ఆలోచన. నాకు ఆ విషయంలో స్పష్టత ఉంది. నేను ఎబార్షన్‌కు వ్యతిరేకం కాదు. ఆడపిల్లలని నిర్ధారించుకుని చేయించుకునే ఎబార్షన్లకే వ్యతిరేకం. మామూలుగా అయితే ఎబార్షన్ అనేది స్త్రీల ఇష్ట ప్రకారం వారి హక్కుగా ఉండాలి" ఈ విషయంలో శైలజ ఎవరికీ తల వంచనసే పద్ధతిలోనే మాట్లాడుతుంది.

మూడో నెల సగపడుతూనే స్కానింగ్ తీయించుకోమని గొడవ మొదలుపెట్టాడు. శైలజతో చెప్పింది కమల.

"అంత తొందరేం. మూడోనెల నిండనివ్వు" అంది శైలజ. ఆ పదిహేను రోజులూ విశ్వనాథం తన మనసులో మాట బైటపెడుతూనే ఉన్నాడు.

ఆమె స్కానింగ్ చేయించుకోవాలి. ఆడపిల్లయితే ఎబార్షన్ చేయించుకోవాలి. అది వినగానే కమలకు గుండె జారిపోయింది.

అబార్షన్ అంటే భయమనీ కాదు. మొగుడి మాట మీద పూర్తి వ్యతిరేకతా కాదు.

శైలజ గురించి భయం.

శైలజ తన దగ్గరకు వచ్చే ఆడవాళ్ళను స్కానింగ్‌కు పంపుతుంది. స్కానింగ్ సెంటరతనికి ఫోన్‌చేసి ఆడో మగో చెప్పొద్దనీ, చెప్తే తను చర్య తీసుకుంటాననీ హెచ్చరిస్తుంది. ఎవరైనా తనకు తెలియకుండా స్కానింగ్ చేయించుకుని, ఆడపిల్ల వద్దంటూ అబార్షన్ చేయమంటే ముక్కు చివాట్లు పెట్టి పంపుతుంది. ఆ మాట ప్రచారమై ఎబార్షన్ ఉద్దేశం ఉన్న వాళ్ళు శైలజ దగ్గరకు వచ్చేవాళ్ళు కాదు. వేరే డాక్టరు దగ్గరకు వెళ్ళి పనిపూర్తి చేయించుకునే వాళ్ళు. శైలజకు ఆ వార్త ఎవరో ఒకరు చేరవేసేవాళ్ళు. శైలజకు ఆ పూట బి.పి. పెరిగిపోయేది. ఆడపిల్లలను పుట్టకుండా చేస్తున్న ఆ తలిదండ్రులను, డాక్టర్లనూ, స్కానింగ్ సెంటర్లనూ తిట్టిపోసేది. ఒకటి రెండుసార్లు కేసు పెడదామని చూసింది గానీ భర్త పడనివ్వలేదు.

"ఆధారాలు లేవు. కేసు నిలవదు" అన్నాడు. అతను లాయర్.

"అసలు నీక్కూడా ఈ ఎబార్షన్ల మీద కోపం లేదు" అంటుంది శైలజ.

"అలాగయితే నాకు ముగ్గురు కొడుకులుండేవారు గదా" అంటాడతను.

శైలజకు తొలికాన్పులో కొడుకు పుట్టినప్పుడు కాసేపు విచారించింది. ముందు కూతురు పుడితే రెండోసారి ఎవరు పుడతారోనని టెన్షన్ ఉండదని ఆమె అంటే అందరూ వింతగా చూసేవారు. అందరికీ టెన్షన్ మొదట కూతురు పుట్టినప్పుడే వస్తుంది. దానికి భిన్నంగా ఆలోచించే శైలజ వాళ్ళకర్థం కాదు. రెండోసారి స్కానింగ్‌లో మగపిల్లవాడని తెలిసేసరికి అబార్షన్ చేయించుకుంటానని పట్టుబట్టింది. భర్త రమేష్ హతాశుడయ్యాడు. అతనికాపని బొత్తిగా ఇష్టంలేదు.

మూడో బిడ్డను కనలేనని శైలజ, కనవచ్చని రమేష్ వాదులాడుకున్నారు.

చివరకు రమేష్ తనమాట నెగ్గించుకున్నాడు.

రెండో కొడుకుని కని కూతురి కోసం ఎదురుచూసింది శైలజ.

మూడోసారి స్కానింగ్‌లో మళ్ళీ మగపిల్లవాడని తెలిసేసరికి వెంటనే ఎబార్షన్ చేయించుకుని ఆ తర్వాత రమేష్‌కు ఫోన్‌చేసి చెప్పింది. ఇక తనకు ఆడపిల్లల ఆశ లేదనుకుని ఆపరేషన్ చేయించుకుంది. అసలు ఆడపిల్లలు లేనివాళ్ళు కూడా ఆడపిల్ల ఒద్దనుకుని అబార్షన్లు చేయించుకున్నప్పుడల్లా శైలజ కోపంతో, దుఃఖంతో మండిపడేది.

"నువ్వు మగపిల్లల్ని ఒద్దనుకోలా" అంటాడు రమేష్.

"నేను ఇద్దరు మగపిల్లల్ని కన్నాను గదా" అంటుంది

శైలజ.

ఇక వాళ్ళిద్దరి మధ్యా వాదన మొదలవుతుంది.

"మొన్న ఇద్దరాడపిల్లలున్న వాళ్ళు మూడోసారి ఆడపిల్ల ఒద్దనుకుని అబార్షన్ కోసం వస్తే వాళ్ళనెందుకు తిట్టావు?"

"ఆడపిల్ల అనే కారణంతో అబార్షన్ చేయించుకోటానికి నేను వ్యతిరేకం. ఆడపిల్లల్ని పుట్టకుండా చేయటం అన్యాయం" శైలజ చాలా గట్టిగా చెబుతుంది.

"మగపిల్లాడ్ని పుట్టకుండా చెయ్యటం అన్యాయం కదా" రమేష్ ప్రశ్నిస్తాడు.

"కాదు. అదీ ఇదీ ఒకటి కాదు. నాది చాలా పొలిటికల్ డెసిషన్. ముగ్గురు మగపిల్లల్ని కనటం దేశ జనాభా దృష్ట్యా చూస్తే అనవసరం"

"నువ్వు కుటుంబ విషయాన్ని రాజకీయాలు, జనాభా అంటూ చూడకూడదు. మనసుతో ఆలోచించి చూడాలి. పొట్టలో ప్రాణం పోసుకుంటున్న శిశువు ఆడైనా మగైనా అబార్షన్ అన్యాయం." రమేష్‌కు మూడో కొడుకు కూడా ఉంటే బాగుండేది కదా అనే ఆలోచన.

"అది పూర్తి సెంటిమెంటల్ ఆలోచన. నాకు ఆ విషయంలో స్పష్టత ఉంది. నేను ఎబార్షన్‌కు వ్యతిరేకం కాదు. ఆడపిల్లలని నిర్ధారించుకుని చేయించుకునే ఎబార్షన్లకే వ్యతిరేకం. మామూలుగా అయితే ఎబార్షన్ అనేది స్త్రీల ఇష్ట ప్రకారం వారి హక్కుగా ఉండాలి" ఈ విషయంలో శైలజ ఎవరికీ తల ఒంచననే పద్ధతిలోనే మాట్లాడుతుంది.

"మరి ఆడపిల్లల్ని ఒద్దనుకున్నపుడు అది వారి రైట్ కాదా?" రమేష్ కూడా అంత తేలికగా ఒదిలే రకం కాదు.

"అది రైట్ కాదు. ఆ ఆడవాళ్ళకు తెలియదు. తాము స్త్రీ జాతిని నాశనం చేసే పనిలో భాగమయ్యామని వాళ్ళకు తెలియదు. భర్త ఒత్తిడో, అత్తమామల ఒత్తిడో ఉంటుంది వాళ్ళమీద. ఆర్థిక పరిస్థితులు కారణమవుతాయి. వీటన్నిటి నుంచీ ఆమెను తప్పించి ఆ ఆడశిశువును రక్షించాల్సిన బాధ్యత డాక్టర్‌గా నాకుంది" అంటుంది శైలజ.

"నీతో వాదించటం అనవసరం." అంటూ అతను లేచేవాడు.

"గెలవలేనపుడు ఆ మాట అనకేం చేస్తావు" అనేది శైలజ.

ఇదంతా కమలకు తెలుసు. ఆడపిల్ల గాబట్టి ఎబార్షన్ అనే మాట శైలజ ముందు ఎత్తితే ఏమవుతుందో కమలకు చాలా బాగా తెలుసు. ఆ ఆలోచనకే భయంగా ఉంటోంది.

ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా ఇద్దరు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయటమంటే సామాన్యం కాదు. అసలిక కొడుకా కూతురా అని చూడకుండా ఒక్క బిడ్డతో





సరిపెట్టుకుందామని కమల అనుకుంటుండగా ఈ కష్టం వచ్చిపడింది. విశ్వనాథానికి కొడుకు కావాలనే కోర్కె తీవ్రంగానే ఉంది. అందుకే కమలని స్కానింగ్ తీయించుకోమని సతాయిస్తున్నాడు.

* * *

కమల అటూ యిటూ తచ్చాడటం శైలజ చూస్తూనే ఉంది. వర్షమని కాబోలు పేషంట్ల సంఖ్య తక్కువగానే ఉంది. ఉన్న పదిమందినీ చూసి పంపాక మెడికల్ జర్నల్ తిరగేస్తూ కూచుంది శైలజ. ఇలాంటి తీరిక రోజులు చాలా అరుదుగా దొరుకుతాయామెకు. వాటిని పూర్తిగా సద్వినియోగం చెయ్యాలని ప్రయత్నిస్తుంది. శైలజ చదువును భంగపరచటం ఇష్టం లేనట్టూ, చెయ్యక తప్పనట్టూ ఊగిసలాడుతూ అక్కడక్కడే తిరుగుతోంది కమల.

చుట్టూ నీళ్ళుంటే మధ్యనుండి, ముందుకు పోతూ వెనక్కు వస్తూ ఉన్న చీమలా ఉందామె స్థితి.

చివరకు ఆమె అవస్థను శైలజే గమనించింది. రమ్మని పిలిచింది. ఎదురుగా కూచోమంది. ఏమిటి విషయమని సూటిగా అడిగింది. కమల తలెత్తి శైలజ ముఖంలోకి సూటిగా చూడలేకపోయింది. తల టేబిల్ మీద ఆన్చినట్టుగా వంచి చెప్పింది. "మా ఆయన స్కానింగ్ చేయించుకోమంటే..."

"చేయించుకో - ఆయన చెప్పకపోతే నీకు తెలియదా నాల్గో నెల్లో స్కానింగ్‌కు వెళ్ళాలని"

"ఆడపిల్లయితే ఒద్దంటున్నాడు" నిజాన్ని విషం కక్కినట్టు కక్కి తేలికపడింది కమల.

ఇంక ఏదయితే అదవుతుంది. తను నిజం చెప్పేసింది. కమలకిపుడు నిశ్చింతగా ఉంది.

శైలజ ఆ మాట అడిగించుకోటానికి ఒక నిముషం పట్టింది.

"మీ ఆయనకు బుద్ధిలేదు. నువ్వేమన్నావు?"

" ఏమీ అనలా"

"ఎందుకనలా? అను. ఆడపిల్ల అయినా కంటానని చెప్పు"

కమల కళ్ళల్లో నీళ్ళు టపటపమని చప్పుడు చేస్తూ టేబిల్ మీద పడేసరికి శైలజకు అదంత సింపుల్ విషయం కాదనిపించింది.

"ఏడుస్తావేంటి? మీ ఆయన మాట జవదాటవా?" శైలజ గొంతులో కాఠిన్యానికి కమల బావురుమంది.

" అరే. ఎందుకట్లా ఏడుస్తావు? ఆడపిల్లని కంటే తలగొట్టి మొలేస్తాడా? ఏం ఫరవాలేదు. ఐనా స్కానింగ్ సెంటర్‌కి ఫోన్‌చేసి అతనికీ విషయం చెప్పొద్దని చెబుతానుగా." అనునయంగా అంది శైలజ.

"స్కానింగ్ చేయించుకున్నా నిన్ననే" బలహీనంగా చెప్పింది.

శైలజకి అనుమానం వచ్చింది.

"ఆడపిల్లని చెప్పాడా?"

కమల ఔనని తలూపి మళ్ళీ ఏడుస్తోంది.

శైలజకు ఈసారి నిజంగా కోపం వచ్చింది.

తనతో ఒక్కమాట చెప్పకుండా స్కానింగ్ చేయించుకుంది. విషయం తెలుసుకుని అబార్షన్ చేయించుకోమని భర్త చెబితే దానికి ఒప్పుకుని తన దగ్గర ఏడుస్తోంది. పెద్ద నమ్మక ద్రోహమేదో జరిగినట్లు ఫీలైంది శైలజ. తన దగ్గర పనిచేస్తూ ఇలాంటి నిర్ణయం తీసుకుంటుందా? ఎంత ధైర్యం?

" ఏం చేస్తావు?"

కమల మాట్లాడకుండా కళ్ళు తుడుచుకుంది.

"నీ ఏడుపు చూస్తుంటే అర్థమవుతూనే ఉంది నువ్వేం చెయ్యాలనుకుంటున్నావో"

కమల తల నేలలోకి దిగబడిపోయింది.

"నా సంగతి తెలుసుగా. నేనాపని చెయ్యను. ఎవరన్నా చేసినా నాకిష్టం ఉండదు. నువ్వు ఎబార్షన్ చేయించుకోదల్చుకుంటే లెక్కజూసి నీ జీతం తీసుకుని వెళ్ళిపో. మళ్ళీ రావొద్దు." కమలకు పాతాళంలో పడినట్లనిపించింది. శైలజకు కోపం వస్తుందని తెలుసుగానీ, తనను ఉద్యోగంలోంచి తీసేస్తుందనే ఆలోచనే రాలేదు.

భయంతో ఏడుపాగిపోయింది. ఈ ఉద్యోగం ఒదులుకోలేదు. విశ్వనాథం ఊరుకోడు. కమల ముఖం చూస్తూ అక్కడ కూర్చోటం ఇష్టం లేనట్టు శైలజ లేచి వెళ్ళిపోయింది.

***

ఇంటికి వెళ్ళాలంటే భయంగా ఉంది కమలకు. విశ్వనాథం వెళ్ళగానే అడుగుతాడు. చెప్పినదంతా విని మండిపడతాడు. డాక్టర్ని తిట్టిపోస్తాడు. ఉద్యోగం

వదిలెయ్యమంటాడు. ఇంకోచోట చూసుకోవచ్చంటాడు. తనకు కొడుకు కావాల్సిందేనంటాడు.

ఇంకో ఉద్యోగం దొరక్కపోదు. తనకున్న అనుభవం తక్కువేం కాదు. కానీ శైలజ లాంటి వాళ్ళు అరుదు. ఇక్కడ తనకెంతో బాగుంది. డాక్టర్ చెప్పే మాటలో అర్థముందనిపిస్తోంది. ఇద్దరాడపిల్లల పెళ్ళి తేలిక కాదు.

తల పగిలిపోయేంత నొప్పి. చల్లటి వాతావరణంలో కూడా తలంతా వేడెక్కిపోయింది.

వర్షం పెద్దదయింది. పొద్దుటి నుండీ కురవకుండా నిగ్రహించుకున్నదంతా ఒక్కసారి కుండపోత పోస్తోంది. అంతా చీకటి కమ్మేసింది. ఆ క్షణంలో ఆ చీకటి భయంకరంగా అనిపించింది కమలకు.

ఇంతలో ఎవరో వచ్చారు హడావుడిగా. కమల లేచి వెళ్ళింది. నొప్పులతో వస్తోందొకావిడ.

"కృపా ఆమెను ఎడ్మిట్‌చేసి రెడీ చెయ్యి" అంటూనే కాన్పుల గదిలోకి వెళ్ళింది కమల.

అరగంటలో ఆమెను గదిలోకి తెచ్చి తను పరీక్ష చేసి డాక్టర్‌కి ఫోను చేసింది.

శైలజ వచ్చింది. కమలను చూడనట్టే.

"కృపా - ఇవాళ నువ్వురా" అంటూ పిల్చింది.

కృపా, శైలజా లోపలికి వెళ్తుంటే పిచ్చిదానిలా బైట నిలబడింది కమల.

లోపల జరిగేదంతా తెలుసు. ఏ నిమిషంలో ఏం జరుగుతుందో, ఎవరేమంటారో, ఎప్పుడేం చెయ్యాలో అన్నీ తెలుసు. అన్నీ తెలిసి బైట నిలబడి ఉండటం ఎంత బాధో మొదటిసారి తెలిసింది కమలకు.

గంటసేపు అక్కడే నిలబడింది.

లోపల నుంచి బిడ్డ ఏడుపు వినిపించి ఉలిక్కిపడింది.

మరి కాస్సేపట్లో డాక్టర్ బైటికొస్తుంది.

కమల మెల్లిగా అక్కడ్నించీ కదిలింది.

వర్షం కురుస్తూనే ఉంది. వెలిసే వరకు ఆగాలనిపించలేదు.

అంత వానలో గొడుగు లాభం లేదని తెలిసినా ఆ చిన్న ఆసరాతోనే బైల్దేరింది.

ఇంటికెళ్ళేసరికి తడిసి ముద్దయింది.

" ఇంత వర్షంలో ఎందుకొచ్చావు" అన్నాడేగానీ విశ్వనాథం కూర్చున్న చోటి నుంచి కదలలేదు.

కమల స్నానంచేసి వచ్చేసరికి విపరీతంగా నీరసం. నడుం నొప్పి.

కాఫీపెట్టి విశ్వనాథానికిచ్చి తనూ తాగి పడుకుంది. విశ్వనాథం మెల్లిగా వచ్చాడు.

"చెప్పావా డాక్టరమ్మతో"

ఇప్పుడతని కోపాన్ని భరించే స్థితిలో లేదు. చెప్పింది విని డాక్టర్‌ని తిడుతుంటే వినటమూ ఇష్టంలేదు.

"చెప్పలేదు. ఇవాళ డాక్టర్ రాలేదు. రేపు చెప్తా"

అని పక్కకు తిరిగింది.

"నాకు ఆకలవుతోంది. వంట తొందరగా చెయ్"

విశ్వనాథం వెళ్ళిపోయాడు.

కమలకు దుఃఖం ముంచుకొచ్చింది.

తన మనసులో తుఫాను ఎవరూ అర్థం చేసుకోరు.

భర్తా, డాక్టరమ్మా ఇద్దరూ ఇద్దరే.

ఇద్దరికీ అధికారం తనమీద.

ఆమె ఉద్యోగం పీకేస్తుంది. ఈయన గీచిన గీటు దాటితే మండిపడతాడు. మొగుడ్నంటాడు.

ఒదిలెయ్యగలను జాగ్రత్తనే హెచ్చరిక వినపడేలా అంటాడు. వీళ్ళిద్దరి మధ్యా బంతిలా తనూ-

తంతుంటారు అటూ, ఇటూ-

కానీ తనెందుకుండాలి అట్లా-

అసలు తన ఇష్టం ఏమిటి?

కమలకు దుఃఖం ముంచుకొచ్చింది. తన మనసులో తుఫాను ఎవరూ అర్థం చేసుకోరు. భర్తా, డాక్టరమ్మా ఇద్దరూ ఇద్దరే. ఇద్దరికీ అధికారం తనమీద. ఆమె ఉద్యోగం పీకేస్తుంది. ఈయన గీచిన గీటు దాటితే మండిపడతాడు. మొగుడ్నంటాడు. ఒదిలెయ్యగలను జాగ్రత్తనే హెచ్చరిక వినపడేలా అంటాడు. వీళ్ళిద్దరి మధ్యా బంతిలా తనూ- తంతుంటారు అటూ, ఇటూ- కానీ తనెందుకుండాలి అట్లా- అసలు తన ఇష్టం ఏమిటి?

తనసలు ఒక్క కూతురే చాలనుకుంది. భర్త పట్టుదల వల్ల ఈ కడుపు.

మగ పిల్లాడ్ని కనకపోతే విలువలేదు అతని దృష్టిలో. అతనికి విలువ ఇవ్వకుండా ఉండాల్సింది. బలహీనంగా లొంగిపోయింది.

అయిందేదో అయిందనుకుంటే ఇప్పుడీ చిక్కు-

చిక్కూ లేదూ పాడూ లేదు. ఆడపిల్ల పుడుతుందని తెలిసి తీసేయించుకోవటం తనకూ ఇష్టం లేదు.

కనేస్తే సరి. ఏం చేస్తాడో చేసుకోమను.

ఇంకో ఆడపిల్లను కంటాను. ఇద్దరాడపిల్లలు. ఫరవాలేదు. బతకలేకపోరు. తను బతకటం లేదూ?

పెళ్ళి కాకపోతే పోయింది. పెళ్ళికాకపోతే ఏమయింది

మరింత బాగా బతుకుతారు.

నేను ఆడపిల్లను కంటాను.

ఇలా అనుకున్నాక కమలకు హాయిగా అనిపించింది. ప్రాణం తెరిపిన పడినట్లయింది.

వంట చేయాలనుకుని లేచింది.

వర్షం పడుతున్నా తీసే ఉంచిన కిటికీలోంచి జల్లు కొట్టి ఇల్లంతా తడిగా ఉండటం కమల గమనించింది. భర్త ఒళ్ళు బద్ధకాన్ని ఇంత బాధలోనూ తిట్టుకుంది. కానీ ఆ సంగతి మర్చిపోయి గభాల్న లేచిందేమో కాలు జర్రున జారి అంత దూరాన బోర్లా పడింది. ఆ పడటంలో పొట్ట వెళ్ళి బలంగా గడపకు కొట్టుకుంది. కమల అరుపుకు పరిగెత్తుకొచ్చాడు విశ్వనాథం. మెల్లిగా లేవదీసి మంచంమీద పడుకోబెట్టాడు.

"చూసుకోకుండా నడుస్తావు. ఒట్టి మనిషివి కాదు".

చివాట్లేస్తున్నాడు.

కమలకు మెల్లిగా తెలుస్తోంది. డాక్టర్ ప్రమేయం లేకుండా పని జరిగిపోతోంది.

కడుపులోంచి, మూల మూలల్లోంచి తన్నుకొచ్చింది ఏడుపు.

అంత ఏడుపేడుస్తున్న భార్యను చూసి భయపడిపోయాడు విశ్వనాథం.

"ఆస్పత్రికి వెళ్ళాలి ఆటో తీసుకురండి" అంది కమల ఏడుపు ఆగిన తర్వాత.

***

కమల మెల్లిగా స్పృహలోకి వస్తోంది. అంతా అయోమయంగా గందరగోళంగా ఉంది. బావిలోంచి పైకి పాకుతున్న భావన. ఆధారం సరిగా దొరకటంలేదు. చీకట్లోంచి వెలుతుర్లోకి రావటం ఎంత కష్టంగానో ఉంది. ఐనా తప్పదు. రావాలి. రావాలి. పెనుగులాడుతోంది.

చివరికి వచ్చింది. ఆసుపత్రిలో ఇనప మంచం మీదికి.

డాక్టర్ శైలజ వంగి కమలను చూస్తోంది.

" ఎలా ఉంది కమలా?"

కమల కళ్ళల్లో నీళ్ళు

"అనుకోకుండా జరిగిన దానికేం చేస్తావు చెప్పు. బాధ పడకు. మధ్యాహ్నం నేను కోపంగా ఏదో అన్నాను గానీ నీ పరిస్థితులు నీకుంటాయి గదా. అదంతా మర్చిపో. విశ్రాంతి తీసుకో"

స్నేహంగా పలుకుతున్న శైలజ గొంతు హాయిగా ఉంది.

మర్నాడు శైలజ రౌండ్స్‌కి వచ్చేసరికి పది గంటలు దాటింది.

" ఇంకా ఇక్కడే ఉన్నావా? పొద్దున్నే ఇంటికి వెళ్ళకపోయావా?

నవ్వుతూ అడిగింది.

"వెళ్దామనే అనుకున్నా. కానీ ఏకంగా ఇంకో నాలుగు రోజులుండి వెళ్దామని ఆగిపోయా" అంది కమల.

"నాలుగు రోజులా?" ఆశ్చర్యపోయింది శైలజ.

" ఇవాళో రేపో నాకు ఆపరేషన్ చేసెయ్యండి. నాకు ఒక్క కూతురు చాలు"

స్థిరంగా అంటున్న కమల ముఖంలోకి చూసింది శైలజ.

కమల కళ్ళు శైలజకు ఎన్నో విషయాలు చెప్పాయి.

అవి మాటల్లో చెప్పలేనివి.

అవన్నీ అర్థం చేసుకున్నట్లు కమల చెయ్యిపట్టుకుంది.

"అయాం సారీ!" అంది మెల్లిగా.

కమల గట్టిగా చెప్పింది.

" ఈ నిర్ణయంలో మీ ప్రమేయంగానీ, మా ఆయన ప్రమేయంగానీ లేదు డాక్టర్. నా స్వంత నిర్ణయం ఇది. మీరు సారీ చెప్పక్కర్లేదు. నిర్ణయం మీకు నచ్చకపోతే ఉద్యోగం మానేస్తాను."

కమలను దగ్గరకు తీసుకుని కౌగలించుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది శైలజ.

ఆ నీళ్ళు ఎంతకూ ఆగటంలేదు.